క్లుప్తంగా

ఎర్రబెల్లికి గిరిజనం హోలీ


మంత్రితో హోలీ ఆడుతున్న గిరిజన మహిళలు

దేవరుప్పుల: మండలంలోని కడవెండి శివారు వానకొండయ్య లక్ష్మీనర్సింహ్మస్వామి జాతర ప్రారంభోత్సవానికి వచ్చిన పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు పెద్ద ఎత్తున గిరిజన మహిళలు చేరుకొని రంగులు చల్లి తమ ఆనందాన్ని పంచుకున్నారు. మంత్రి సైతం బంజారా మహిళలతో కోలాటం ఆడి పండుగ ఇనాములు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

సభను విజయవంతం చేయాలి


కొడకండ్ల: మాట్లాడుతున్న సంపత్‌రెడ్డి

కొడకండ్ల: పాలకుర్తి నియోజకవర్గంలోని తొర్రూరులో నిర్వహించే రాష్ట్ర స్థాయి మహిళా దినోత్సవ సభకు మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని జెడ్పీ చైర్మన్, జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పాగాల సంపత్‌రెడ్డి కోరారు. మంగళవారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన బీఆర్‌ఎస్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అన్ని గ్రామాల నుంచి మహిళలు పెద్ద ఎత్తున హాజరయ్యేలా ప్రజాప్రతినిధులు, నాయకులు కృషి చేయాలని ఆయన కోరారు. మార్కెట్ చైర్మన్ పేరం రాము, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సిందె రామోజీ, ఆర్‌ఎస్‌ఎస్ కన్వీనర్ వెంకటేశ్వర్‌రావు, మార్కెట్ డైరెక్టర్ అమరేందర్‌రెడ్డి, నసీర్, రాజిరెడ్డి, జక్కుల విజయమ్మ, సత్యనారాయణ, ఆసీఫ్, వెంకటనారాయణ, రాంకోటి, సతీష్‌గౌడ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

అత్యధిక సంఖ్యలోతరలిరావాలి

పాలకుర్తి: తొర్రూరు మండల కేంద్రంలో బుధవారం నిర్వహించే మంత్రి కేటీఆర్ సభకు అత్యధిక సంఖ్యలో ప్రజలు తరలిరావాలని జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి అన్నారు. పాలకుర్తిలో మంత్రి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సంపత్‌రెడ్డి మాట్లాడారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, ఎంపీపీ నల్ల నాగిరెడ్డి, జెడ్పీటీసీ శ్రీనివాసరావు, మార్కెట్ చైర్మన్ రాంబాబు, రాఘవరావు పాల్గొన్నారు.

ముగిసిన ఎల్లమ్మ ఆలయ ఉత్సవాలు

చిల్పూరు: దాతలు, భక్తులు, ప్రజాప్రతినిధులు, ప్రజల సహకారంతో మూడు రోజుల పాటు నిర్వహించిన చిల్పూరుగుట్ట శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయ ఉత్సవాలు మంగళవారం ముగిశాయని ఆలయ అధ్యక్షుడు నారగోని రాజు, ఉపాధ్యక్షుడు సట్ల లింగయ్య తెలిపారు. కార్యక్రమంలో పొన్నం కుమార్, పంతం రాజు, మాచర్ల స్వామి, సట్ల కొంరయ్య, మాచర్ల రాజు, మల్లయ్య, నారగోని వెంకన్న, చంద్రమౌళి, యువజన సంఘం అధ్యక్షుడు రవిచంద్ర, పరమేశ్వర్, కుమారస్వామి, సునీల్, రంజిత్, స్వామి, కొంరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవితను కలిసిన వాస్విక్ చైర్మన్



బచ్చన్నపేట: తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట కవితను, ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి మారెప్పలను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశామని వాస్విక్ ఫౌండేషన్ చైర్మన్ నిడిగొండ నరేష్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీని కలిసి పుష్పగుచ్ఛం అందించామన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ వైస్ చైర్మన్ నూకల భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

15న హుండీ లెక్కింపు

పాలకుర్తి టౌన్: శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఈనెల 15న బుధవారం ఉదయం 10 గంటలకు హుండీలోని కానుకల లెక్కింపు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ నండూరి రజనీకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. లెక్కింపులో ఆలయ చైర్మన్, ధర్మకర్తలు, అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని ఈఓ కోరారు.

ఆత్మవిశ్వాసంతో ముందుకు..

మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. కష్టాన్ని సైతం ఎదుర్కొంటూ ముందుకు సాగుతున్నారు. అయితే అక్కడక్కడా ఇంకా వివక్ష కొనసాగుతోంది. అయినా మహిళలు వెరువక ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్తున్నారు. నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

మహిళా దినోత్సవం

ఎన్నో కష్టాలను అధిగమించి..



జనగామ రూరల్: జనగామకు చెందిన బొట్ల సుమతి చిన్నతనం నుంచే కాలు వంకరగా, మరుగుజ్జుతో ఉంది. 30 ఏళ్ల నుంచి రేషన్ డీలర్‌గా ఉంటూ కుటుంబాన్ని పోషించుకుంటోంది. 13 ఏళ్ల క్రితం భర్త రాజేందర్ అనారోగ్యంతో మృతి చెందగా ఉండడానికి సొంత ఇల్లు కూడా లేదు. ఇద్దరు ఆడపిల్లలు ఉండగా ఒకరిని డిగ్రీ, మరొకరు ఇంటర్ వరకు చదివించి వారికి వివాహం చేసింది. పిల్లల భవిష్యత్ కోసం పని చేస్తుంది. ఎన్నో కష్టాలు అధికమించి స్వయంకృషితో ముందుగు సాగుతున్న మహిళలు ఆత్మస్థైర్యంతో అన్ని రంగాల్లో ముందుండాలని అంటోంది.


బస్టాండ్ వద్ద చెప్పులు కుడుతున్న దేవరకొండ అరుణ

చెప్పలు కుడుతూ కుటుంబ పోషణ

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రానికి చెందిన దేవరకొండ అరుణ అనే నిరుపేద కుటుంబానికి చెందిన మహిళ చెప్పులను కుట్టే పనిచేస్తూ కుమారుడిని ఉన్నత చదువులు చదివించి అందరికీ ఆదర్శంగా నిలుస్తుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గతంలో అరుణ భర్త శంకరయ్య చెప్పులు కుడుతూ కుటుంబాన్ని పోషించేవాడు. అయితే పద్నాలుగేళ్ల క్రితం అతడు అనారోగ్యంతో మృతిచెందాడు. అప్పటి నుంచి కుటుంబ పోషణ భారం ఆమెపై పడింది. భర్త చనిపోయిన బాధను దిగమింగుకుంటూ స్థానిక బస్టాండ్ వద్ద చెప్పులు కుట్టే పని చేస్తూ కుటుంబాన్ని పోషించింది. కష్టపడి పనిచేసి కుమారుడిని చదివించింది. తల్లి పడుతున్న కష్టాన్ని గుర్తించిన కుమారుడు నరేష్ కష్టపడి చదివాడు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదివిన అతను ఎస్‌ఎస్‌సీలో ఉత్తమ మార్కులు సాధించడంతో హనుమకొండలోని ఎస్‌ఆర్ కళాశాలలో ఫ్రీసీట్ సాధించాడు. అనంతరం కేయూ క్యాంపస్‌లో బీటెక్ పూర్తి చేశాడు. అయితే ప్రభుత్వ ఉద్యోగం రాకపోవడంతో తల్లికి చేదోడువాదోడుగా ఉండేందుకు ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ ఆమెకు ఆసరాగా నిలుస్తున్నాడు. బీటెక్ చదివే సమయంలోనూ నరేష్ చెప్పులు కుట్టే పనిలో తల్లికి సహకరించేవాడు. ఏది ఏమైనా భర్త మృతిచెందినా మొక్కవోని దీక్షతో చెప్పులు కుట్టే పనిచేస్తూ కుమారుడిని ఉన్నత చదువులు చదివించిన తీరు అందరికీ ఆదర్శనీయం.


కుమారుడు నరేష్‌తో అరుణ

మొక్కవోని ధైర్యంతో..



కొడకండ్ల: మనోధైర్యం, త్యాగానికి మారుపేరుగా భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలుస్తుంది కొడకండ్ల మండలంలోని రామవరం గ్రామానికి చెందిన మోర్తాల రమ. రామవరం గ్రామానికి చెందిన మోర్తాల వెంకటేశ్వర్లును రమ 27 సంవత్సరాల క్రితం వివాహం చేసుకొని వ్యవసాయమే జీవనాధారంగా జీవించే క్రమంలో ఒక కుమార్తె, కుమారుడు జన్మించారు. అన్యోన్యంగా ఆదర్శంగా వారి దాంపత్యం సాగుతున్న నేపథ్యంలో కుటుంబపెద్ద వెంకటేశ్వర్లు కిడ్నీ వ్యాధి భారినపడ్డాడు. అస్పత్రుల చుట్టూ తిరిగి లక్షలు ఖర్చు చేసినా నయం కాకపోవడంతో కిడ్నీ మార్పిడే శరణ్యమని వైద్యులు చెప్పారు. భర్త ప్రాణాన్ని కాపాడుకోవాలని రమ తన కిడ్నీ ఇచ్చేందుకు ముందుకొచ్చింది. వెంటనే వైద్యులు ఆమెకు వైద్య పరీక్షలు నిర్వహించి 2014 సంవత్సరంలో ఆపరేషన్ నిర్వహించి కిడ్నీ మార్చారు. అదే సమయంలో ప్రాదేశిక ఎన్నికలు నిర్వహించడంతో రామవరం ఎంపీటీసీ స్థానానికి రమ కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్ వేసి విజయం సాధించింది. అటు కిడ్నీదానంతో భర్తకు ప్రాణం పోసానన్న ఆనందం, ఇటు ప్రజల దీవెనలతో ఎంపీటీసీగా గెలిచిన రమకు విధి వెక్కిరించి త్యాగానికి ఫలితం లేకుండా పోయి రెండేళ్లకే భర్త అనారోగ్యానికి గురై మృతి చెందాడు. భర్త మృతితో ఇద్దరు పిల్లల పోషణభారం మీదపడినా రమ మొక్కవోని ధైర్యంతో ముందుకు సాగుతూ ఎంపీటీసీగా ప్రజా సేవలో నిమగ్నమై వ్యవసాయ సాగుతో కుటుంబాన్ని పోషించి ముందుకు సాగింది. 2018లో కుమార్తె హేమకు వివాహం చేసింది. కుమారుడు శ్రీకాంత్‌ను డిగ్రీ చదివించింది. భర్తను కోల్పోయిన దుఃఖాన్ని రమ దిగమింగుకొని ముందుకు సాగి ఉపాధి పనుల కూలీకి సైతం వెళ్లి పిల్లలకు తండ్రి లేని లోటును లేకుండా కష్టాలకు ఎదురొడ్డి ముందుకు సాగిన రమ జీవితం ఆదర్శదాయకం.

ప్రోత్సాహంతోనే విజయం

అనేక రంగాల్లో తమను తాము నిరూపించుకోవడానికి ప్రోత్సాహం తప్పనిసరి అని అంటున్నారు మహిళలు. అవనిలో సగం .. అన్ని రంగల్లో సగం అని వర్ణించే మహిళలకు అనేక చోట్ల ఇప్పటికీ వివక్ష ఎదురవుతుందని చెబుతూ.. కుటుంబ సభ్యుల ప్రోత్సాహం ఉంటే ఏదైనా సాధించగలం అని దీమాగా చెబుతున్నారు.. ఈ మహిళా అధికారులు.

- జనగామ

అమ్మా, నాన్నకు రుణపడిఉంటా..

- రోజారాణి, జిల్లాపౌరసరఫరాల శాఖ అధికారి



నాన్న పోలీస్ కానిస్టేబుల్.. అమ్మ గృహిణి. నలుగురు అక్కా, చెల్లెల్లు, ఇద్దరు తమ్ముళ్లు. రేషన్ సరుకులతో ఇళ్లు నడిచేది. కూతుళ్లను పెళ్లి చేసి పంపించాలని అనుకోకుండా... నాన్న బాగా చదివించాడు. పరీక్షలో మార్కులు తక్కువ వస్తే ఊరుకునే వాడు కాదు. అమ్మకు చెప్పి ప్రతిరోజు తెల్లవారుజాము 4 గంటలకే నిద్రలేపి ప్రిపరేషన్ చేయించి.. ర్యాంకు వస్తే సంతోషించేవాడు. నాతో పాటు ముగ్గురు అక్కాచెల్లెళ్లు ప్రభుత్వ కొలువుల్లో పని చేస్తుండగా, పెద్ద తమ్ముడు ముంబయి ఐఐటీలో.. చిన్నోడు ఇంటలిజెన్స్ బ్యూరోలో సైంటిస్టుగా ఉద్యోగం చేస్తున్నాడు. పెళ్లైన తర్వాత భర్త సహకారం మరువలేనిది. నెలనెలా రేషన్ సరుకుల కోసం వెళ్లేవారం. ఇప్పుడు ఆదేశాఖకు జిల్లా హెడ్‌గా విధులు నిర్వర్తించడం గర్వంగా ఫీలవుతున్నా.

కూతుళ్లను బాగా చదివించండి

- బొల్లం సంధ్యారాణి, సివిల్ సప్లయీస్ డీఎం, జనగామ



ప్రతి తల్లిదండ్రులు కూతుళ్లకు పెళ్లి చేసి, అత్తారింటికి పంపించాలనే ఆలోచన చేయకుండా బాగా చదివించాలి. ఊరు నుంచి ప్రపంచం వరకు ప్రస్తుతం మహిళలదే పై చేయి. నాన్న అజంజాహి మిల్లులో ఉద్యోగం చేస్తూ.. నాతో పాటు ఇద్దరు అక్కా, చెల్లను బాగా చదివించాడు. నాకు ఉద్యోగం వచ్చిన రోజు నాన్న సంతోషం అంతా ఇంతా కాదు. పోస్టింగ్ వచ్చే సమయంలో నాన్న గుండె పోటుతో మృతిచెందాడు. అప్పటి నుంచి అమ్మను కంటికి రెప్పలా కాపాడుకుంటున్నా. ఉద్యోగ రీత్యా భర్త సహకారం ఎప్పటికి మరచిపోలేని.

గ్రామాల సమగ్రాభివృద్ధికి పాటుపడుతున్న సీఎం

స్టేషన్‌ఘన్‌పూర్: తెలంగాణ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో సీఎం కేసీఆర్ గ్రామాల సమగ్ర అభివృద్ధికి కృషిచేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. డివిజన్ కేంద్రమైన స్టేషన్‌ఘన్‌పూర్‌లో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే రాజయ్య మంగళవారం శంకుస్థాపన చేసి మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే నంబర్‌వన్‌గా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. జెడ్పీటీసీ మారపాక రవి, సర్పంచ్ తాటికొండ సురేష్‌కుమార్, ఎంపీటీసీలు ఉన్నారు.

పార్టీ బలోపేతానికి కృషిచేయాలి


చిల్పూరు: మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజయ్య

చిల్పూరు: పదవులు ముఖ్యం కాదు.. పార్టీ మరింత బలోపేతానికి ప్రతీ కార్యకర్త కృషి చేయాలని ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య సూచించారు. మండలంలో బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బొమ్మిశెట్టి బాలరాజు, మండల ఇన్‌చార్జ్‌గా గుర్రపు వెంకటేశ్వర్లను నియమించారు. కాగా, మంగళవారం ఎమ్మెల్యేను వారు మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఎంపీపీ సరిత, చిల్పూరు ఆలయ చైర్మన్ శ్రీధర్‌రావు, నాయకులు మనోజ్‌రెడ్డి, రంజిత్ రెడ్డి, రంగు రమేష్, రంగు హరీష్ పాల్గొన్నారు.

క్వారీ పనులను అడ్డుకున్న గిరిజనులు

● పోలీస్‌స్టేషన్ చెంతకు చేరిన మిషన్‌లు

దేవరుప్పుల : ప్రభుత్వ అనుమతుల పేరిట చారిత్రాత్మక శ్రీ వానకొండయ్య గుట్టపై క్వారీ పనులు కోసం మరోసారి శ్రీకారం చుట్టేందుకు సోమవారం అర్ధరాత్రి మిషన్‌లతో చేరగా గిరిజనులు అడ్డుకున్నారు. గత ఎడాది అక్టోబర్ 18న కడవెండి శివారులోని శ్రీ వానకొండయ్య గుట్టను ఆనుకొని ఉన్న లాకావత్‌తండా(ధర్మాపురం) పరిధి 37 సర్వే నంబరు గల ప్రభుత్వ గుట్టపట్టా ప్రాంతంలో సుమారు పది ఎకరాల్లో గ్రానైట్ క్వారీ అనుమతుల లీజు పేరిట కాంట్రాక్టర్లు రంగంలోకి దిగారు. ఈ విషయమై కడవెండి, ధర్మాపురం, మాధాపురం రెవెన్యూ పరిధి గిరిజన తండాల ప్రజలు, రైతులు దేవునిగుట్టను విధ్వంసం చేయొద్దని ఆందోళనకు దిగారు. దీంతో స్పందించిన మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సైతం సదరు అనుమతులు రద్దు చేయాలని సీఎస్ సోమేష్‌కుమార్‌కు లేఖ రాయడంతో తాత్కాలికంగా పనులకు బ్రేక్ పడింది. ఈ క్రమంలోనే సోమవారం రాత్రి సదరు కాంట్రాక్టర్లు మిషన్‌లతో గుట్టపైకి ఎక్కడానికి యత్నించగా గిరిజనులు అడ్డుకొని వెళ్లగొట్టారు. ఈ క్రమంలో మిషన్లు పోలీస్‌స్టేషన్ పక్కన పెట్టడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయమై పొట్టిగుట్టతండాలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి వచ్చిన మంత్రి దయాకర్‌రావుతో గిరిజనులు గుట్ట విషయం ప్రస్తావించగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే వచ్చిన గ్రానైట్ క్వారీ అనుమతులతో తనకు ఎలాంటి సంబంధం లేదనీ, ప్రజాభిష్టం మేరకు దేవునిగుట్టపై ఒక్క రాయి తీయకుండా చర్యలు తీసుకుంటాననీ హామీ ఇచ్చారు. ఈ విషయమై సత్వరమే కలెక్టర్ శివలింగయ్యను ఆదేశిస్తూ గుట్టపైకి క్వారీ కాంట్రాక్టర్లు రాకుండా, సదరు అనుమతులు రద్దు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.


వానకొండయ్య గుట్టపై క్వారీ అమనుతుల ప్రాంతం (ఇన్‌సెట్ సర్కిల్)

భగీరథ లీకేజీ..

కలుషితమవుతున్న తాగునీరు


లీకేజీని చూపుతున్న స్థానికుడు

రఘునాథపల్లి: మండల కేంద్రంలోని ఖిలాషాపూర్ రోడ్డులోని వెల్దిక్రాస్ రోడ్డు సమీపంలో మిషన్‌భగీరథ పైపులైన్ లీకై తాగు నీరు కలుషితమవుతుంది. దాదాపు 15 రోజులుగా నీరు కలుషితమవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. పైపులైన్ లికేజీ నుంచి నీరు బయటకు వచ్చి మురికి కూపంగా మారింది. దీనికి తోడు లీకేజీ ప్రాంతంలో స్థానికులు చెత్తను పడవేస్తుండటంతో ఆ నీరంతా కలుషితమై అలాగే ఇళ్లకు సరఫరా అవుతుంది. అక్కడ పందులు, కుక్కలు కూడా తిరుగుతున్నాయి. అయినా లీకేజీకి మరమ్మతులు చేయడంలో మిషన్ భగీరథ అధికారులు పట్టించుకోకపోవడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి లికేజీలను అరికట్టి ప్రజలకు సురక్షితమైన తాగు నీరు అందజేయాలని కోరుతున్నారు.

క్రైం కార్నర్

సముద్రాలలో చోరీ

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని సముద్రాలలో తాళం వేసి ఉన్న కట్ల అనీల్‌కు చెందిన ఇంటిలో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి రూ. 1 లక్ష నగదు, తులంన్నర బంగారం, పది తులాల వెండి పట్ట గొలుసులు అపహరించిన సంఘటన సోమవారం జరుగగా మంగళవారం వెలుగులోకి వచ్చింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కట్ల అనీల్ వ్యవసాయ పనులు చేస్తుంటాడు. రోజూ మాదిరిగానే సోమవారం కుటుంబ సభ్యులతో కలిసి తమ వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. ఇంటికి వచ్చి చూడగా బీరువాలో ఉన్న రూ.లక్ష నగదుతో పాటు తులంన్నర బంగారం, పది తులాల వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించాడు. అయితే ఇంటి తాళం చెవి దాచి ఉంచడాన్ని గుర్తించిన వారే ఈ చోరీకి పాల్పడినట్లుగా భావిస్తున్నారని అనిల్ ఫిర్యాదు చేసినట్లు సీఐ రాఘవేందర్ తెలిపారు.

గుడిలో..

మండలంలోని విశ్వనాథపురం పోచమ్మ తల్లి దేవాలయంలో మంగళవారం చోరీ జరిగింది. సర్పంచ్ అనుమాండ్ల మల్లేశం, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామశివారులోని పోచమ్మ ఆలయంలోని హుండీ కనిపించకపోవడంతో గుర్తించిన గ్రామస్తులు సర్పంచ్‌కు సమాచారం అందించారు. దీంతో వారు వెళ్లి పరిశీలించగా గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారని, ఏకంగా హుండీనే చోరీచేసినట్లు గుర్తించారు. హుండీ ధర రూ.పదివేలు ఉంటుందని, అందులో దాదాపు రూ.5వేలవరకు కానుకలు ఉంటాయని తెలిపారు. ఈ విషయమై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

జనగామ రూరల్: బైక్ అదుపుతప్పి గుంతలోకి దూసుకెళ్లిన ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన ఘనట మంగళవారం రాత్రి చంపక్‌హిల్స్ సమీపంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ మండలంలోని చౌడారం గ్రామానికి చెందిన మునిగే రాజు తన సోదరి స్థానిక ఎంసీహెచ్ ఆస్పత్రిలో డెలివరీ అయింది. కాగా, సాయంత్రం లింగాలఘనపురం మండలంలోని కుందారం గ్రామానికి చెందిన బావ శ్రీనివాస్‌తో కలిసి వెళ్లి చూసి వస్తున్నారు. ఈ క్రమంలో చంపక్ హిల్స్ మలుపు వద్ద బైక్ అదుపుతప్పి గుంతలోకి దూసుకెళ్లడంతో రాజు కాలు విరగగా శ్రీనివాస్‌కు గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఏరియా అస్పత్రికి తరలించారు.

జనగామ:17వ వార్డులో..



జనగామ: జీఎంఆర్ కాలనీలో..



జనగామ: కుర్మవాడలో..



డీసీపీ కార్యాలయంలో స్వీట్ల పంపిణీ



జనగామ: జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ ధన్వంతితో హోలీ వేడుకల్లో భర్త డాక్టర్ లక్ష్మీనారాయణనాయక్



అంబరాన్నంటిన హోలీ సంబురాలు

రంగుల కేళి.. రంగోలి సప్త వర్ణాల హోలీ పండుగను జిల్లా వ్యాప్తంగా ప్రజలు మంగళవారం ఘనంగా నిర్వహించుకున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, పిల్లలు, పెద్దలు, యువత రంగులు చల్లుకుంటూ సంబురాలు జరుపుకున్నారు. ఈ క్రమంలో హోలీ వేడుకలు అంబరాన్నంటాయి. రంగుల పండుగతో వీధులన్నీ కొత్తశోభను సంతరించుకున్నాయి.

- సాక్షి నెట్‌వర్క్


జనగామ: బీజేపీ రాష్ట్ర నాయకులు ముక్కెరతో అభిమానుల సంబురాలు


జిల్లా కేంద్రంలో..


సీఐ కుమారుడికి రంగు పూస్తున్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి


జనగామ: నెహ్రూపార్కు వద్ద మహిళల హోలీ


రఘునాథపల్లి: ఇబ్రహీంపూర్‌లో..


జనగామ: బానాపురంలో..


జనగామ: జుబ్లీగార్డెన్ ఏరియాలో పిల్లల కేరింతలు


ఆర్టీసీ చౌరస్తాలో రంగుల పండగ వేడుకలు


బచ్చన్నపేటలో.. నాయకులు


స్టేషన్‌ఘన్‌పూర్‌లో..


నర్మెటలో..


జనగామ రూరల్: వేడుకల్లో ఎంపీపీ కళింగరాజు


లింగాలఘణపురంలో..